క్లుప్తంగా

పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేయండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని 21,22, 27,28 వార్డులలో మంగళవారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అలాగే కార్మికుల అటెండెన్స్‌ను పరిశీలించి విధులకు గైర్హాజరు కాకుండా అందరూ హాజరు కావాలని కోరారు. తెనాలి పట్టణంలో చెత్త సేకరణ మూడు బుట్టల విధానంలో జరుగుతుందని తెలిపారు. అందరూ ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అభివృద్ధి అందరి బాధ్యత

కొల్లిపర: గ్రామ పంచాయతీల అభివృద్ధి అందరి బాధ్యతని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు మంగళవారం నిర్వహించిన రెండువ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు చేయడంతో పాటు తాగునీరు, పారిశుధ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ బార్గవ, వార్డ్ మెంబర్లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పీసీఆర్ ఎస్‌ఐగా రాజ్యలక్ష్మి

తెనాలిరూరల్: తెనాలి పోలీస్ కంట్రోల్ రూం ఎస్‌ఐగా సీహెచ్ రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం జిల్లా వీఆర్‌లో ఉన్న ఆమెకు ఇక్కడ పోస్టింగ్ ఇస్తూ జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఆరు కొత్త బస్సులు ప్రారంభం

తెనాలిఅర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోకు నూతనంగా వచ్చిన ఆరు కొత్త బస్సులను బుధవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే డిపో ఆవరణలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను కూడా ఆయన ప్రారంభిస్తారని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులందరూ పాల్గొనాలని సూచించారు.

దైవ సేవకులు ఐక్యంగా ఉండాలి



తెనాలిరూరల్: దైవ సేవకులందరూ ఐక్యంగా ఉండి ప్రపంచ శాంతి, సమస్త మానవాళి పాప విముక్తి కోసం ప్రార్థించాలని తెనాలి టౌన్ యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్ పాల్ అన్నారు. మారిస్‌పేట రాక్ గాస్పెల్ చర్చి ఆవరణలో ప్రపంచ పాస్టర్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెనాలి టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు బ్రదర్ ఆనందన్న, రెవ పల్లి శామ్యూల్, రెవ ఎస్. చిట్టిబాబు, పాస్టర్ గంటా దానియేలురాజు పాల్గొన్న ఈ కార్యక్రమంలో బిషప్ జాన్‌పాల్‌ను ఘనంగా సత్కరించారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

తెనాలిరూరల్: కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ కొల్లిపర ఏసుపాదం(57) మంగళవారం సాయంత్రం మందుల కోసమని తెనాలి వచ్చారు. ఇక్కడి పాత రత్నా టాకీస్ సెంటర్‌లో ఆటో దిగిన ఆయన రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. అక్కడికక్కడే రోడ్డుపై కుప్పకూలి మృతి చెందాడు. అతడిని గమనించిన స్థానికులు వివరాలు తెలుసుకుని వన్ టౌన్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కొద్ది సేపటికి మృతుడి కుమారులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వెళ్లారు. దావులూరులో వీఆర్‌ఏగా ఏసుపాదంకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు.

రేపు పోస్టాఫీసులో ఆధార్ క్యాంపు

భట్టిప్రోలు: భారతీయ తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టల్ వారోత్సవాలలో భాగంగా తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు ఆదేశానుసారం భట్టిప్రోలు పోస్టాఫీస్‌లో ఈనెల 10న ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఆర్. చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆధార్ నమోదు ఉచితంగా చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆధార్ సవరణలకు రూ. 50 నుంచి రూ. 100 వరకు రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

రహదారులు ఇలా.. నడిచేది ఎలా?

- గుంతలమయమైన రహదారులతో ఇక్కట్లు
- మరమ్మతులు చేయించమంటూ చెంచుపేట అమరావతి ప్లాట్స్, ఉడాకాలనీ వాసుల వినతి



గుంతలమయంగా ఉన్న అమరావతి ప్లాట్స్‌లోని రోడ్డు

తెనాలిరూరల్: తెనాలి చెంచుపేటలోని అమరావతి ప్లాట్స్ వాసులను అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు ముప్పతిప్పలు పెడుతున్నాయి. అమరావతి ప్లాట్స్ ఉడా కాలనీలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటుగా ప్రయాణించాలంటే ఆటో డ్రైవర్లు భయపడుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పెద్దపెద్ద గుంతలతో వాహనదారులకు నరకప్రాయంగా ఉంటోంది. పూర్తి మౌలిక వసతులతో అన్ని విధాలా అభివృద్ధి చెందిన కాలనీలను ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పిన మాటలు నీటి మూటలుగా తేలిపోయాయి.

విజయవాడ కేంద్రంగా ఏర్పాటైన (వీజీటీఎం ఉడా) పట్టణాల్లో కొత్తగా కాలనీలకు దశాబ్దాల క్రితమే శ్రీకారం చుట్టింది. రైతుల నుంచి వ్యవసాయ భూములను కొనుగోలు చేసి అందుబాటు ధరల్లో విక్రయించి వృధ్యతరగతి, అల్పాదాయ వర్గాలకు గృహ వసతి కల్పించాలనేది ఉద్దేశం. ఆ క్రమంలో తెనాలిలో 1980లో 97.42 ఎకరాల భూమిని సేకరించారు. వృధ్యాదాయ వర్గాలు (ఎంఐజీ), అల్పాదాయవర్గాలు (ఎల్ఐజీ), పేదవర్గాలు (ఇడబ్ల్యుఎస్) కోసమని 288, 153, 106 చదరపు గజాల ప్లాట్లను ఏర్పాటు చేశారు.

కలగా కనీస సౌకర్యాల కల్పన

అమరావతి ప్లాట్స్, ఉడా కాలనీ రూపుదాల్చి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ కనీస వసతులు సమకూరలేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి అమరావతి ప్లాట్స్ శివారులోని ఇందిరానగర్ కాలనీకి వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయంగా ఉంది. ఈద్గా మైదానం వద్ద నుంచి రోడ్డు దెబ్బతింది. ఉడా కాలనీలో బీటీ రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఈ కాలనీల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం అడుగడుగునా కనబడుతోంది. అమరావతి ప్లాట్స్ నుంచి జిల్లా వైద్యశాలకు వెళ్లే రోడ్డులో నిర్మించిన డ్రెయిన్‌లో మురుగు పారుదల వెనుకకు మళ్లడంపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ అధికారులూ గతంలో తనిఖీలు చేశారు. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించాలంటే తమ ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోందని, కనీసం రోడ్ల మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో ఇబ్బంది



అమరావతి ప్లాట్స్‌లో ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా తయారైంది. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. తాత్కాలికంగానైనా గుంతలను పూడ్చే పనులు చేయిస్తే కొంత ఉపశమనం ఉంటుంది.

– తలతోటి దేవకుమార్, అమరావతి ప్లాట్స్

ఇబ్బందులు ఎవరికీ పట్టడం లేదు



గుంతలమయంగా ఉన్న రోడ్ల వల్ల ఎంతో ఇబ్బందిగా ఉంటోంది. ఈద్గా మైదానం నుంచి ఇందిరానగర్ కాలనీ వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఎవరికీ పట్టడంలేదు. కనీసం గుంతలు పూడ్చే చర్యలు తీసుకోవడం లేదు.

– జమ్మి సతీష్, ఇందిరానగర్ కాలనీ

11న మోదుకూరు జాతరపై ఫొటోగ్రఫీ పోటీలు

తెనాలి: చుండూరు మండలం మోదుకూరులోని ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మోదుకూరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన దసరా ఉత్సవాల ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించనున్నారు. సంస్థ అధ్యక్షుడు తియ్యగూర సీతారామిరెడ్డి, వ్యవస్థాపకుడు కానాల సుధాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు. మోదుకూరు శివారు కండేపాడులో 1928లో వెలసిన కనకదుర్గ అమ్మవారిని దుర్గాష్టమి రోజున అద్భుతమైన సంబరాలు జరగటం ఆనవాయితీగా గుర్తుచేశారు. ఈనెల 11వ తేదీన దసరాకు ముందురోజు మోదుకూరు జాతరలో తీసిన ఫొటోలతో ఈ పోటీని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒక ఫొటోగ్రాఫర్ ఎన్ని ఫొటోలైనా పంపవచ్చనీ, సెల్‌ఫోన్ ఫొటోగ్రఫీ, ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీలో పోటీలు ఉంటాయని, ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు అయిదుగురికి ప్రశంసాపత్రాలను ఇస్తామన్నారు. జనవరి ఒకటిన మోదుకూరులో జరిగే వేమన జయంతి ఉత్సవాల్లో ఆ ఫొటోలను ప్రదర్శించి, విజేతలకు బహుమతులను ఇస్తామని వివరించారు. తీసిన ఫొటోలను ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఫేస్‌బుక్ పేజీలో అప్‌లోడ్ చేయొచ్చనీ, లేదా phoŝorfenicartrcirce@fmai.comకు ఈమెయిల్‌కు పంపాలనీ, తుదిగడువు నవంబరు 10వ తేదీగా తెలిపారు. ఏవైనా సందేహాలుంటే 9491336258, 98480 92182 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



తెనాలిఅర్బన్: ఆర్టీసీలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంలను మంగళవారం నాయకులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లిశెట్టి దమోదరావు, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రాజేష్ ఖన్నా, రాష్ట్ర ట్రెజరర్ సుధీర్‌కుమార్, ముత్యాలరావు, కుమార్‌నాయక్, మధు, మోహన్, శ్రీదేవి, మాలతి, ఝాన్సీ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వైఖానస ఆగమ అర్చనా విధానంపై ఆన్‌లైన్ కార్యశాల

తెనాలి: వైఖానసాగము అర్చనా విధానంపై తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా తొమ్మిదిరోజుల కార్యశాల జరుగుతుందని ఆగమ విభాగం అధ్యక్షుడు, దర్శనాడీస్, కార్యశాల కన్వీనర్ ప్రొఫెసర్ వేదాన్తం విష్ణుభట్టాచార్యులు మంగళవారం ఒక ప్రకటలో తెలియజేశారు. ఈనెల 16వ తేదీన కార్యశాల ప్రారంభమై, 24వ తేదీవరకు కొనసాగుతుందని తెలిపారు. అర్చన ప్రయోజనం, ఉపచారాలు ఎన్ని రకాలు, మహర్షుల ఉపదేశం ఎటువంటిది? ఆగమాలలో వైఖానసాగమ స్వరూపం, వైఖానసాగమ గ్రంథాల పరమార్థం వంటి విషయాలను చర్చావేదికగా కార్యశాల జరుగుతుందని తెలిపారు. వైఖానసాగమంలో నిష్ణాతులైన వారు ఈ విషయాలపై ప్రసంగిస్తారనీ, ఆసక్తిగలవారు httpr://gormr.fe/DnHmJWotrahePjiKA పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే 9849264607ను సంప్రదించాలని కోరారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

భట్టిప్రోలు: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి, రేపల్లె మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సీనియర్ అడ్వకేట్ కొండపల్లి శ్రీనివాసరావు (రేపల్లె) అధ్యక్షతన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలను రూపొందించిందన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవి చేసుకోవద్దని గ్రామీణులకు హితవు పలికారు. సదస్సులో రీసోర్స్ పర్సన్ ఎస్‌బీఏ ఝాన్సీ(సీనియర్ అడ్వకేట్–గుంటూరు), షేక్ అమీనా రెహమానా (అడ్వకేట్)లు ఉచిత న్యాయ సహాయం, గృహహింస చట్టం, మెయింటెనెన్స్, న్యాయ సేవా సంస్థ అందించే సేవలతో పాటు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, వేమూరు సీఐ వీరాంజనేయులు, భట్టిప్రోలు ఇన్‌ఛార్జ్ ఎస్ఐ రవికృష్ణ, కొల్లూరు ఎస్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు శివరామకృష్ణ, ప్రసాద్, పంచాయతీ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలోని దేవీచౌక్‌లో శ్రీదుర్గాదేవిగా..



శ్రీ రామలింగేశ్వరపేటలో శ్రీధనలక్ష్మీ దేవిగా..



మహావారాహి దేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరీ..

శ్రీదేవీ శరన్నవ రాత్రుల్లో భాగంగా మంగళవారం తెనాలిలోని వివిధ దేవాలయాల్లో అమ్మవారికి అలంకారాలు.

–తెనాలి



తెనాలిలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు



నందివెలుగులో శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా..



పెదరావూరులో శారదాదేవికి ప్రత్యేక అలంకారం..



తెనాలిలో శ్రీధనలక్ష్మీ దేవిగా..

హిందూసనాతన ధర్మంలో

మౌలికమైన ప్రమాణం వేదం

వేద మహాసభలో పండితులు



వేదపారాయణం చేస్తున్న పండితులు

తెనాలి: హిందూ సనాతనధర్మంలో అత్యంత మౌలికమైన ప్రమాణం వేదమని భగవంతుని ద్వారా వేదం పుట్టిందని పలువురు వేదపండితులు పేర్కొన్నారు. వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య, తెనాలి ఆధ్వర్యంలో స్థానిక నాజరుపేటలోని విద్యాశంకర భారతి నరసింహ సదనంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేద మహాసభ నిర్వహించారు సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన వహించారు. వేద పండితులు విష్ణుభట్ల ఆంజనేయ చైను లు ఘనపాటి, విష్ణుభట్ల శ్రీకృష్ణ ఘనపాటి, విష్ణుభట్ల సత్యనారాయణ ఘనపాటి, విష్ణుభట్ల లక్ష్మీపతి ఘనాపాటి తమ ప్రసంగాల్లో వేదం విశిష్టతను వివరించారు. విశ్వవ్యాపితమైన విషయాలు నిధిగా సృష్టికి కారణభూతమైనదిగా వేదం వెలుగొందుతోందని చెప్పారు. ఋషులు భగవంతుని ద్వారా వేదాన్ని విని లోకానికి దానిని గానం చేస్తూ అందించారని తెలిపారు. బుద్ధి సూక్ష్మతను పెంచుకోవడానికి వేదాలు ఎంతగానో దోహదపడతాయనీ, వేద సభలతో లోకానికి హితం కలుగుతుందని అన్నారు. సమాఖ్య కార్యవర్గసభ్యులు ముందుగా గణపతి ప్రార్థన చేసి గాయత్రీ దేవికి విశేష పూజలు చేశారు. కంచి పరమాచార్య స్వామీజీ, విద్యా శంకర భారతీయ నరసింహ స్వామీజీ ఆశీస్సులు కోరుతూ ప్రార్థన చేశారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన 58 మంది వేద పండితులు వేద పారాయణ చేశారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు భాగవతుల కామేశ్వరరావు, కోశాధికారి తురుమెళ్ల దక్షిణామూర్తి ఉపాధ్యక్షులు కేవీ సుబ్రహ్మణ్యం, మేడూరి శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి రావినూతల రాజేంద్రప్రసాద్, మేళ్లచెరువు అనిల్ కుమార్, పింగళి వేణుధర్, కార్యవర్గ సభ్యులు నారాయణం వేణుగోపాల్, సీఎంకే తిరుమలరావు, పుల్లే సూర్యప్రకాష్ రావు పాల్గొన్నారు

13న మారథాన్‌లో పాల్గొనండి



మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖ వ్యాపారి శ్యామ్‌ప్రసాద్

తెనాలిఅర్బన్: తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న గుంటూరులో ఇండియా పోస్టు రన్ పేరిట 10కె, 5కె, 3కె రన్‌లను నిర్వహించనున్నట్లు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కరుణా కరబాబు తెలిపారు. రన్‌కు స్పాన్సర్స్‌గా ఉన్న తెనాలి డబల్‌హార్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత మునగాల శ్యామ్‌ప్రసాద్, కుమార్‌పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యంలను మంగళవారం వారి కార్యాలయంలో పోస్టల్ ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 1000 మంది రన్‌లో పాల్గొనేందుకు తమ పేర్లు రిజిష్టర్ చేయించుకున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి మెడల్స్ అందజేయనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పోస్టల్ ఉన్నతాధికారులు పాల్గొంటారని వివరించారు. అనంతరం మెడల్స్‌ను తెనాలి డబల్‌హార్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత మునగాల శ్యామ్‌ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ పుట్ట శేఖర్, విజయవాడ చీఫ్ పోస్ట్‌మాస్టర్ కార్యాలయ అధికారి సుధీర్‌బాబు, గుంటూరు పోస్టల్ సూపరింటెండెంట్ యు.యలమందయ్య పాల్గొన్నారు.

పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్లకు సన్మానం



కోటేశ్వరరావు, మహేష్‌లను సన్మానిస్తున్న పూర్ణచంద్, శంకరరావు

తెనాలిఅర్బన్: సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేసన కోటేశ్వరరావు, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జొన్నాదుల మహేష్‌లు ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో వారిని బస్టాండ్ సమీపంలోని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ఆశీస్సులతో తమకు పదవులు లభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, కౌన్సిలర్ దివి అనిత, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, నాయకులు కన్నెగంటి మురళీ, మహేష్, నల్లపాటి రాము, ఫణీదపు దుర్గా, చల్లగాలి శంకర్, రవీంద్ర, కాకుమాను ఉపేంద్ర, కుర్రా శ్రీహరి, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక పద్యనాటకం

ఘనంగా వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు



సాంఘిక పద్యనాటకం 'సంజ వెలుగు'లో సన్నివేశం



సాంఘిక నాటిక 'చిగురుమేఘం'లో సన్నివేశం



సాంఘిక నాటకం 'మంత్రనగరి'

తెనాలి: సాంఘిక పద్యనాటకం... వీణా అవార్డ్స్ నాటకోత్సవాల్లో సరికొత్త ప్రయోగం. తొలి రోజున మొదటగా ప్రదర్శించిన నాటకం 'సంజ వెలుగు'. శ్రీకళానికేతన్, హైదరాబాద్ సమాజం ప్రదర్శించిన ఈ నాటకం సమకాలీన సామాజిక సమస్యను ప్రతిబింబించింది. తల్లిదండ్రుల ఆస్తులు, ఆదాయంపై ఉన్న శ్రద్ధ, ఆపేక్ష, వారి ఆలనాపాలనా మీద కొరవడుతున్న నేటికాల పరిస్థితులను ఈ నాటకం ప్రేక్షకుల ముందుకు తెచ్చింది. ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్‌తో ఆస్తులు, ఆదాయంతోపాటు తల్లిదండ్రులను కూడా పంచుకున్న కొడుకుల కథ ఇది. ఒక కొడుకు తల్లిని అమెరికా తీసుకెళితే, మరోకోడుకు తండ్రిని తమతో ఉంచుకుంటాడు. ఆరోగ్యం బాగాలేక దగ్గుతుంటే, అదెక్కడ తన బిడ్డకు సంక్రమిస్తుందోనన్న భార్య పోరు పడలేక అనాథాశ్రమంలో వదిలేస్తాడు. తాత, నానమ్మల ప్రేమనే కాకుండా వారిద్వారా ఆత్మీయత, అనుబంధాల గొప్పతనం తెలుసుకున్న మనవడు, చిన్న నాటకం ఆడి తన తల్లిదండ్రులు, బాబాయిల కళ్లు తెరిపిస్తాడు. నాటకం సుఖాంతమవుతుంది. నాటకంలోని అన్ని పద్యాలు క్లుప్తంగా, భావయుక్తంగా ఉన్నాయి. నటీనటుల పద్యగానాలాపన సంగీత హోరులో కొట్టుకుపోకుండా అర్థమయ్యాయి. అందుకే రెండు గంటలసేపు ఆడిన పద్యనాటకాన్ని ప్రేక్షకులు ఆసాంతం తిలకించారు. సినిమాల్లో విస్తృతంగా నటిస్తున్న సురభి ప్రభావతి కూడా ఇందులో ఉన్నారు. తడకమళ్ల రామచంద్రరావు రచించిన ఈ నాటకాన్ని డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వంలో ప్రదర్శించారు.

కృత్రిమ మేధనే నమ్ముకుంటే అనర్థం

టెక్నాలజీ విప్లవంలో భాగంగా ప్రస్తుతకాలంలో బాగా వినిపిస్తున్న పేరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. ఏఐగా పిలుచుకునే ఈ కృత్రిమ మేధపై మనుషులు ఆధారపడితే మెషీన్లుగా మారిపోతారు. ప్రేమ, పలకరింత, ఆప్యాయతలు తగ్గిపోతున్నాయి. ఇలాగే కొనసాగితే మనిషి ప్రాణం ఉన్న మరబొమ్మగా మారిపోయే ప్రమాదం ఉంది. ఏఐతో మానవ సహజమైన మేధస్సు కూడా అవసరమే.. ఇవి సమపాళ్లలో ఉంటేనే యంత్రనగరాలు కాకుండా మంత్ర నగరాలు అన్న సందేశంతో ప్రదర్శించిన సాంఘిక నాటకం 'మంత్ర నగరి'. చైతన్య కళాస్రవంతి (ఉక్కునగరం), విశాఖపట్నం సమాజం మధ్యాహ్నం ప్రదర్శించిన ఈ నాటకాన్ని మాడభూషి దివాకరబాబు రచించారు. దర్శకత్వం: పి.బాలాజీనాయక్.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులపై ఎక్స్‌రే

అమరావతి ఆర్ట్స్, గుంటూరు సమాజం రాత్రి 6.45 గంటలకు ప్రదర్శించిన 'చిగురుమేఘం' నాటిక పట్టణాల్లో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల ధనాశకు అద్దం పట్టింది. ఆసుపత్రుల్లో సామాన్య రోగులపట్ల సిబ్బంది నిరాదరణ, సరికొత్త వ్యూహాలతో విస్తరించాలన్న డాక్టర్ల ఆకాంక్షలను, నటీనటులు పాత్రోచితంగా నటించారు. కావూరి సత్యనారాయణ రచించిన నాటికకు వై.హరిబాబు దర్శకత్వం వహించారు.

వివాహేతర సంబంధాలపై హెచ్చరిక

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరుకు చెందిన వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారు చివరగా ప్రదర్శించిన 'నిశి' నాటిక వివాహేతర సంబంధాలతో కలిగే అనర్థాలను తెలియజెప్పింది. కోరికల మత్తులో అక్రమ సంబంధాలకు పాల్పడితే, విచక్షణ కోల్పోతారు. చెయ్యరాని తప్పులు చేసి, కష్టాల ఊబిలో చిక్కుకుంటారు. తమ జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటారు. సమాజంలో నిత్యం చూస్తున్న ఇలాంటి ఘనలు ఎలా జరుగుతున్నాయి? వాటికి కారణాలేంటి? ప్రతిఫలం ఏమిటి అనే అంశాలను వివరించిందీ నాటిక. పోలుదాసు శ్రీనివాసరావు రచించిన నాటికకు ఆయనే దర్శకత్వం వహించారు.

ప్రజల్లో అవగాహన కల్పించండి



తెనాలిఅర్బన్: వ్యక్తిగత పరిశుభ్రత, శానిటేషన్, సురక్షిత మంచినీటి ప్రధాన్యతను తెలియజేస్తూ వారిలో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి తాలటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. ఆశా డే కార్యక్రమాన్ని మారీసుపేట, సుల్తానాబాద్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం నిర్వహించారు. ఆశా వర్కర్ల పనితీరుపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు నాదెళ్ల లక్ష్మీ ఆశా నోడల్ ఆఫీసర్ పి.వెంకటేశ్వరమ్మ, సహాయ మలేరియా అధికారి సిహెచ్.ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.